క్రీడల్లో 'రెవెన్యూ' విజేతలకు కలెక్టర్ అభినందనలు

ప్రజాశక్తి -తిరుపతి టౌన్

అనంతపురం జిల్లాలో ఈ నెల 7 నుండి 9 తేదీలలో జరిగిన 7వ రాష్ట్ర స్థాయి రెవెన్యూ క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలలో తిరుపతి జిల్లా రెవిన్యూ ఉద్యోగులు సురేంద్ర డిప్యూటీ తహసీల్దార్ , జయరాజ్ డిప్యూటీ తహసీల్దార్ క్యారమ్స్ నందు ప్రథమ స్థానం, మ్యూజికల్ చైర్స్ నందు మాధవి, టైపిస్ట్ తహసీల్దార్ కార్యాలయం పుత్తూరు ద్వితీయ స్థానం సాధించారు. పతకాలు సాధించిన వారిని జిల్లా కలెక్టర్ డా. ఎస్ . వెంకటేశ్వర్, జిల్లా రెవెన్యూ అధికారి జి నరసింహులు సన్మానించారు. ఆంధ్ర ప్రదేశ్ రెవిన్యూ అసోసియేషన్ జిల్లా ప్రెసిడెంట్ శివ ప్రసాద్ ,రాష్ట్ర కార్యదర్శి అశోక రెడ్డి , జిల్లా జనరల్ సెక్రటరీ గోపి నాథ్ రెడ్డి, జిల్లా కోశాధికారి రూప్ చాంద్ , క్రీడా సాంస్కృతిక సెక్రటరీ దిలీప్ , తిరుపతి కలెక్టరేట్ శాఖ ప్రెసిడెంట్ భాస్కర్ పాల్గొన్నారు.

అమ్మవారి అన్నదాన కేంద్రం వద్ద

'ఈ హుండీ' బ్రేక్..! కానుకలు బ్యాక్..!

మరమ్మతులు పట్టించుకోని అధికారులు
భక్తులు కోరుతున్నా తీవ్ర నిర్లక్ష్యం..

పగిలిన ఈహుండీ

ప్రజాశక్తి-తిరుపతి సిటి

సిరులతల్లి పద్మావతి అమ్మవారు. అమ్మవారి ఆలయానికి వచ్చే భక్తులు విరివిగా కానుకలు చెల్లించడం ఆనవాయితీ. తిరుచానూరులోని ఎన్వి అన్నదానం వద్ద టిటిడి ఏర్పాటు చేసిన ఈ-హుండీ నాలుగు నెలలుగా పనిచేస్తే ఒట్టు. భక్తులే స్వయంగా ఫిర్యాదు చేస్తున్నా పట్టించుకోకపోవడం శోచనీయం. నాలుగు నెలలుగా ఫిర్యాదులు వస్తున్నా అధికారులు నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తుండడంతో సుమారు 10 లక్షల రూపాయలకు పైగా హుండీకి చేరకపోవడం గమనార్హం.

తిరుచానూరు పద్మావతి అమ్మవారి ఆలయం తిరుమల శ్రీవారి ఆలయం తర్వాత అంతటి ప్రసిద్ధి చెందినది ఇది. అమ్మవారి ఆలయానికి వచ్చే భక్తులకు ఉచిత భోజనవసతి కల్పించేందుకు ఆలయానికి సమీపంలోని తోళ్లప్పగార్డెన్లో టిటిడి ఎన్వి అన్నదాన కేంద్రాన్ని ఏర్పాటు చేసింది. ఇక్కడ ప్రతి రోజూ 3 వేల మంది, వారాంతంలో 5వేల మంది భక్తులు అన్న ప్రసాదాలు సీకరిస్తుంటారు. అన్నదాన కేంద్రానికి వచ్చే భక్తులు తమ కడుపు నింపిన దేవతకు స్వయంగా కానుకలు ఇవ్వడం పరిపాటే. దీన్ని దష్టిలో ఉంచుకొని టిటిడి అన్నదానం సత్రం నుంచి వెలుపలికి వెళ్లే దారిలో భక్తులకు అందుబాటులో ఈ-హుండీ ఏర్పాటు చేసింది. అన్నప్రసాదం స్వీకరించే భక్తులు తమకు తోచినంత డబ్బు కానుకల ద్వారా ఆన్లైన్ పద్ధతిలో ఫోన్పే ఉపయోగించి ఇవ్వడం జరుగుతోంది. నెలకు సుమారు 3 నుంచి 4 లక్షల రూపాయలు ఈ ఇ-హుండీ ద్వారా కానుకలు నేరుగా టిటిడి అకౌంట్కు జమవుతుంది. ఇ-హుండీని నాలుగు నెలల క్రితం ఎవరో ఆకతాయిలు ధ్వంసం చేశారు. అప్పటి నుంచి అది పనిచేయడం లేదు. దీన్ని బాగు చేయాల్సిన అధికారులు నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. అన్నదానం సూపరింటెండెంట్ ఇది నా పరిధి కాదన్నట్లు వ్యవహరిస్తూ, పని చేయడం లేదని ఉన్నతాధికారుకలు చెప్పడంతో తన పనైపోయిందనేలా వ్యవహరిస్తున్నారు. ఇ-హుండీ ఉన్న ప్రాంతానికి విజిలెన్స్ కార్యాలయానికి పట్టుమని 50 మీటర్ల దూరం కూడా లేదు. భద్రత చర్యలు పర్యవేక్షించే వ్యవస్థకు సంబంధించిన వారు అటు వైపు కన్నెత్తి చూస్తే ఒట్టు ఇ-హుండీ ఉన్న ప్రదేశంలో గాని, పరిసరాల్లో గానీ కనీసం సిసి కెమెరాలు ఏర్పాటు చేయాలన్న ఆలోచనే లేకపోవడం దారుణం. ఆకతాయిల చేష్టల వల్ల పాడైపోయిన ఇ-హుండీని బాగు చేయపోవడంతో 4 నెలలో కనీసం అంటే 10 లక్షల రూపాయలకు పైగా భక్తులు ఇచ్చే కానుకలు టిటిడ్ ఖజానాకు రాకుండా పోయాయి. భక్తులే స్వయంగా కానుకలు ఇస్తాం. ఎక్కడ వేయాలని అడుగుతున్నా మాకు తెలియదని, అంతగా అవసరమైతే డిప్యూటీ ఈవో కార్యాలయంలో సంప్రదించాలని అక్కడి సిబ్బంది ఉచిత సలహా ఇస్తుండడం గమనార్హం. ఇ-హుండీ మరమత్తులు చేయడంలో అటు టిటిడి పరిపాలన అధికారులు, ఇటు విజిలెన్స్ అధికారులు ఒకరిపై ఒకరు నేపం వేసుకుంటూ నాలుగు నెలలు కాలయాపన చేయడం శోచనీయం. మరో నాలుగురోజుల్లో తిరుచానూరు అమ్మవారి బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి. కనీసం బ్రహ్మోత్సవాలకైన్నా అన్నదానం సత్రం వద్ద, ఇ-హుండీ పని చేసేలా టిటిడి ఉన్నతాధికారులు చర్యలు తీసుకుంటే, టిటిడి ఖజానాకు కొంత ఆదాయం వస్తుంది. ఆ దిశగా అధికారులు స్పందించి, చర్యలు తీసుకుని, భక్తులకు ఇ-హుండీని అందుబాటులోకి తీసుకొస్తారని పలువురు భక్తులు ఆశిస్తున్నారు.

ఇ-హుండీ అలంకార ప్రాయమేనా..?
సుభాషిణి, భక్తురాలు, విజయవాడ

తిరుచానూరులోని అన్నదాన సత్రం వద్ద ఉన్న ఇ-హుండీ కేవలం అలంకార ప్రాయనికే ఉన్నట్టు ఉంది. రెండు నెలల క్రితం సెప్టెంబరులో కుటుంబంతో అమ్మవారి దర్శనానికి వచ్చాను. ఈ సందర్భంగా ఎన్వి క్యాంటీన్లు భోజనం చేసి, కానుకలు ఇ-హుండీలో వేద్దామని ప్రయత్నిస్తే మిషన్ పని చేయలేదు. తిరిగి నవంబరు రెండో వారంలో అమ్మవారి దర్శనం అనంతరం అన్నదానం క్యాంటీన్కు వెళ్లితే అప్పుడు కూడా మిషన్ పని చేయలేదు. అధికారులు ఇ-హుండీని అలంకార ప్రాయానికే ఉంచినట్లు ఉంది.

గుడికి వెళ్లి హుండీలో వేయమన్నారు : నరేంద్ర, భీమిలి

అమ్మవారి అన్నప్రసాదాలు స్వీకరించిన తర్వాత మా వంతు సాయంగా భక్తిభావంతో కొంత సొమ్మును కానుక ఇద్దామని ప్రయత్నించాను. అన్నదానం వద్ద ఉన్న ఇ-హుండీ పని చేయలేదు. అక్కడున్న అధికారులను, సిబ్బందిని అడిగితే గుడికి వెళ్లి హుండీలో వేయమన్నారు. మరోసారి అమ్మవారి దర్శనానికి వెళ్లాలంటే గంటల తరబడి క్యూలైన్లో వేచి ఉండాల్సిన పరిస్థితి. చేసేది లేక, అక్కడ నుంచి కొంత అసంతృప్తితో వెనుతిరిగాం. అక్కడే ఉన్న యాచకులకు 100 రూపాయలు ఇచ్చి వెళ్లుతున్నాం.

ఎంఎల్ఎలకు సిఎం టైంటేబుల్

పనులు చేసిన ఫొటోలు కంపల్సరీ

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో



ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు రాష్ట్రంలో 48 మంది ఎంఎల్ఎల పనితీరు సరిగ్గా లేదని ఇటీవల జరిగిన మంత్రివర్గ సమావేశంలో బహిరంగంగానే మండిపడిన విషయం తెలిసిందే. 'మారక పోతే మార్పు తప్పదు' అని హెచ్చరికలూ జారీ చేశారు. ఈ నేపథ్యంలోనే ఎంఎల్ఎల పనితీరులో మార్పు కోసం స్వయంగా అధినేత 'టైంటేబుల్' ఫిక్స్ చేశారు. చిత్తూరు, తిరుపతి జిల్లాల ఎంఎల్ఎలు ఐదుగురి పనితీరు సరిగ్గా లేదని నేరుగా ఫోన్ చేసి హెచ్చరించారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న కూటమి ఎంఎల్ఎలకూ చంద్రబాబు టైంటేబుల్ ఫిక్స్ చేసి బాస్గా మారారు. ఇకపై ప్రతి ఎంఎల్ఎ ఒకటో తేదీ పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో తప్పనిసరిగా ఉండాలి. పాల్గొన్న కార్యక్రమానికి సిఎం కార్యాలయానికి ఫొటోలు పెట్టాలి. అలాగే ప్రతి నెలా ఐదో తేదీ ప్రభుత్వ పాఠశాలలను సందర్శించాలి. పిల్లలు,ఉపాధ్యాయులను, తల్లిదండ్రులను కలుసుకుని ఏవైనా సమస్యలు ఉంటే పరిష్కరించే చొరవ చూపాలి. నియోజకవర్గ పరిధిలోని అన్నా క్యాంటిన్లో ప్రతి నెలా పదో తేదీ భోజనం చేయాలి. 15న ప్రభుత్వ ఆస్పత్రులను సందర్శించాలి. 20న కార్యకర్తలతో సమయం కేటాయించాలి. 25న నియోజకవర్గ పరిధిలోని తహశీల్దార్, ఎంపిడిఒ ప్రభుత్వ కార్యాలయాలను తనిఖీ చేయాలి. ఇప్పటికే ఆయా ఎంఎల్ఎలకు టైంటేబుల్ అందినట్లు తెలుస్తోంది. డిసెంబర్ 1 నుంచి అమలు చేసి తీరాలని చంద్రబాబు ఆదేశాలు జారీ చేసినట్లు సమాచారం.

శివుని దర్శించుకున్న నటి స్నేహ

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

ప్రముఖ నటి స్నేహ గురువారం కుటుంబ సమేతంగా శ్రీకాళహస్తీశ్వరాలయానికి విచ్చేశారు. వీరికి ఆలయాధికారులు సాంప్రదాయ స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. ముందుగా రాహుకేతు సర్ప దోష నివారణ పూజలు చేసుకున్నారు. అనంతరం స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. తదనంతరం గురుదక్షిణామూర్తి ఆలయం వద్ద వేద పండితులు ఆశీర్వచనాలు పలికి ముక్కంటి తీర్థప్రసాదాలు, జ్ఞాపికలు అందజేశారు.

ఢిల్లీ బాంబు పేలుళ్ల నేపథ్యంలో...

తిరుపతిలో హై అలర్ట్

అడుగడుగునా తనిఖీలు
రాష్ట్రపతి పర్యటనతో మరింత అప్రమత్తం

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

ఢిల్లీ ఒబాబు పేలుళ్ల ఘటనతో దేశవ్యాప్తంగా ప్రముఖ యాత్రా స్థలాలు, ఆధ్యాత్మిక కేంద్రాలనూ ఇంటిలిజెన్స్ బ్యూరో అప్రమత్తం చేసింది. ఈ నేపథ్యంలో తిరుపతిలో హై అలర్ట్ ప్రకటించి గత రెండు రోజులుగా విస్తృతంగా తనిఖీలు చేపడుతున్నారు. ఈనెల 20, 21 తేదీల్లో భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పర్యటన ఉన్నందున మరింత అప్రమత్తమయ్యారు. తిరుపతిలో నలుమూలల నుంచి వచ్చే వాహనాలను క్షుణ్ణంగా పరిశీలించారు. తాత్కాలిక పోలీసు ఔట్పోస్టులను ఏర్పాటు చేశారు. రాత్రి9 గంటల నుంచి ఉదయం 4 గంటల వరకూ ప్రతి వాహనాన్నీ తనిఖీ చేస్తున్నారు. రేణిగుంట ఎయిర్పోర్టు, శ్రీహరికోట, తిరుమల, తిరుచానూరు, శ్రీకాళహస్తి లాంటి ప్రాంతాల్లో సాయుధ బలగాలను మోహరింపజేశారు. జిల్లా

ఎస్పి ఎల్.సుబ్బరాయుడు జిల్లావ్యాప్తంగా పర్యటిస్తూ ఎప్పటికప్పుడు పోలీసు సిబ్బందిని అప్రమత్తం చేస్తున్నారు. తిరుమలలో ఆక్టోపస్ బలగాలను యాక్టివ్ చేశారు. చిగురువాడ శివాలయం వద్దఏర్పాటు చేసిన ఔట్పోస్టులో బుధవారం రాత్రి అనుమానితులను ఎంఆర్పల్లి స్టేషన్కు తీసుకెళ్లి విచారించి పంపిస్తున్నారు. మంగళం, కరకంబాడి, నారాయణాద్రి ఆస్పత్రి, పేరూరు, వకుళమాత ఆలయం, అగ్రహారం, తిరుచానూరు, రేణిగుంట,చెర్లోపల్లి బైపాస్ ప్రాంతాల్లో సిఐతో పాటు ఒక ఎస్ఐ, పది మంది కానిస్టేబుళ్లు రాత్రివేళ గస్తీ ఉండేలా ఆదేశాలు జారీ చేశారు. తిరుపతిరైల్వేస్టేషన్, బస్టాండ్లలో ఆర్పిఎఫ్, ఆర్టిసి సెక్యూరిటీలో ఎప్పటికప్పుడు అలర్ట్గా ఉంటూ ఏ చిన్న అనుమానం వచ్చినా క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. 20తేదీన ప్రత్యేక విమానంలో రాష్ట్రపతి ముర్ము రానున్నారు. తిరుచానూరు, కపిలతీర్థంలలో దర్శనం చేసుకుని తిరుమల పద్మావతి అతిథిగృహంలో బస చేయనున్నారు. ఇప్పటికే ఢిల్లీ ప్రత్యేక పోలీసులు రాష్ట్రపతి పర్యటించే ప్రాంతాలన్నీ పరిశీలించి, భద్రతను కట్టుదిట్టం చేశారు.

కలెక్టర్కు అఖిలపక్షం నేతల వినతి

రోటరీ, వేమన విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో ర్యాలీ

నిత్యావసరాలు పంపిణీ చేసిన ఆశాలు

కళత్తూరు దళితవాడకు శాశ్వత పరిష్కారం చూపండి

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

కెవిబిపురం మండల కేంద్రానికి అతి దగ్గరగా ఉన్న కళత్తూరు దళితవాడ ప్రజలకు ముంపు నుంచి శాశ్వత పరిష్కారం చూపాలని అఖిలపక్షం తరపున కలెక్టర్కు గురువారం వినతిపత్రం సమర్పించారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు మాట్లాడుతూ ఓళ్లూరు దగ్గరలోని రాయలచెరువు కట్ట తెగి కళత్తూరు దళితవాడను, ఇతర గ్రామాలను, వందలాది ఇళ్లను ముంపుకు గురిచేయడంతో సర్వం కోల్పోయారన్నారు. ఈ నష్టంతో ప్రభుత్వ సాయం నుంచి కొంత బయట పడినప్పటికీ శాశ్వత పరిష్కారం కాదన్నారు. సురక్షితమైన ప్రాంతంలో ప్రత్యామ్నాయ స్థలాలను గుర్తించి ఇళ్లు కట్టించి పునరావాసం కల్పిస్తామని, అది మాత్రమే సంపూర్ణ పరిష్కారం అని తెలిపారు. నిర్వాసితులను స్వచ్ఛందసంస్థలు, సిపిఎం, ఎస్ఎఫ్ఐ, యూనివర్సిటీ విద్యార్థులు, దళితసంఘాలు సాయం చేసి మానవత్వాన్ని చాటుకున్నాయని తెలిపారు.

కలెక్టర్కు అఖిలపక్షం వినతి

కలెక్టర్ స్పందిస్తూ యూనివర్సిటీ ఎస్ఎఫ్ఐ విద్యార్థులు మంచి కృషి చేశారని, ఎన్ఎస్ఎస్, ఎన్సిసి విద్యార్థులను భాగస్వామ్యం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆమ్ ఆద్మీ పార్టీ జిల్లా అధ్యక్షులు నీరుగట్టు నరేష్, తిరుపతిర ఊరల్ ఎంపిపి చంద్రమోహన్రెడ్డి పాల్గొన్నారు.

కళత్తూరు గ్రామస్తులను ఆదుకుందాం

రాయలచెరువు కట్ట తెగి నిర్వాసితులైన కళత్తూరు గ్రామస్తులను ఆదుకుందామని రోటరీక్లబ్, వేమన విజ్ఞాన కేంద్రం ప్రతినిధులు కెటిరోడ్డు నుంచి నాలుగుకాళ్ల మండపం వరకూ ఉదయం గంటసేపు అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రోటరీక్లబ్ అధ్యక్షులు కె.రాజేంద్రశెట్టి, శ్రీకాంత్రెడ్డి, మట్టా పురుషోత్తంరెడ్డి, హేమచందర్, జయరాంప్రసాద్, మల్లారపు నాగార్జున, గురునాథం, బాలాజీచౌదరి తదితరులు పాల్గొన్నారు.

ఆశావర్కర్స్ యూనియన్ చేయూత

కెవిబిపురం : కళత్తూరు ముంపు బాధితులను సిఐటియు ఆధ్వర్యంలో ఆశావర్కర్స్ యూనియన్ జిల్లా కమిటీ వంట సామాగ్రి వస్తువులను అందజేసింది. జిల్లా అధ్యక్ష కార్యదర్శులు లక్ష్మి, కవితలు మాట్లాడుతూ ఉడాతాభక్తిగా తమవంతు సాయం అందిస్తున్నామన్నారు. బియ్యం, మిరపకాయలు, చింతపండు,కందిపప్పు, వంటనూనె అందజేశామన్నారు.

అంగన్వాడీ పిల్లలకు చూయూత

శ్రీకాళహస్తి : కళత్తూరు దళితవాడలోని అంగన్వాడీ పిల్లలకు ప్రజానాట్యమండలి శ్రీకాళహస్తి ప్రాంతీయ కమిటీ చేయూతనిచ్చింది. ప్లేట్లు, గ్లాసులు వితరణగా అందజేశారు. సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు అంగేరి పుల్లయ్య, దాసరి జనార్ధన్, నాయకులు గంధంమణి, పెనగడం గురవయ్య, నాగరాజు పాల్గొన్నారు.

అన్నప్రసాదాల నాణ్యతపై సర్వే

ప్రజాశక్తి - తిరుపతి సిటి

తిరుమలలోని అన్న ప్రసాదాల తయారీకి మరింత నాణ్యమైన బియ్యాన్ని సరఫరా చేయాలని టీటీడీ అదనపు ఈవో సి.హెచ్.వెంకయ్య చౌదరి రైస్ మిల్లర్లను కోరారు. పద్మావతి విశ్రాంతి గహంలోని సమావేశ మందిరంలో ఆయన గురువారం రైస్ మిల్లర్లతో సమావేశం నిర్వహించారు. ఏపీ, తెలంగాణ రైస్ మిల్లర్ల అసోసియేషన్ పర్యవేక్షణలో నిర్దేశిత ప్రమాణాలకు అనుగుణంగా టీటీడీకి బియ్యం సరఫరా అయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. బియ్యం శాంపిల్ ను తీసుకుని ఉడికించిన తర్వాత క్షుణ్ణంగా పరిశీలించిన అనంతరం మాత్రమే అన్న ప్రసాద వినియోగానికి అనుమతించాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. టీటీడీలో ప్రతిరోజూ తిరుమల, తిరుచానూరుతో పాటు ఇతర స్థానిక ఆలయాల్లో ప్రసాదాల తయారీకి 20 వేల కేజీల బియ్యం వినియోగం. టిటిడికి 60:40 నిష్పత్తిలో ఏపీ, తెలంగాణా నుంచి రైస్మిల్లర్ల బియ్యం సరఫరా చేయనున్నట్లు చెప్పారు. శ్రీవారి సేవకుల ద్వారా ఇకపై ప్రతి నెలా అన్నప్రసాదం నాణ్యతపై సర్వే, భక్తుల అభిప్రాయాలను అనుసరించి బియ్యం నాణ్యత పెంచేలా చర్యలు తీసుకోవాలన్నారు. టిటిడిలో కోల్డ్ స్టోరేజి అభివృద్ధిపై పవర్పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈ సమావేశంలో అన్న ప్రసాదం డిప్యూటీ ఈవో రాజేంద్ర, వేర్ హౌజ్ డిప్యూటీ ఈవో పద్మావతి, ప్రొక్యూర్ మెంట్ విభాగాధిపతి ఉమా శంకర్, శ్రీవారి ఆలయ పోటు ఏఈవో మునిరత్నం, క్యాటరింగ్ స్పెషల్ ఆఫీసర్ శాస్త్రి పాల్గొన్నారు.

అండర్ బ్రిడ్జికి అదనపు యాక్సెస్ ఆమోదం

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

తిరుపతి - రేణిగుంట ప్రధాన రహదారిపై రైల్వే గేటు నంబర్ 107 వద్ద నిర్మిస్తున్న రోడ్డు అండర్ బ్రిడ్జి నుంచి తిరుపతి వైపుకు మాత్రమే యాక్సెస్రోడ్డు ఉండగా, అదనంగా ఎడమవైపుకు అనగా రేణిగుంట వైపు యాక్సెస్ రోడ్డును ఏర్పాటు చేసేందుకు దక్షిణ మధ్య రైల్వే నుంచి ఆమోదం లభించిందని ఎంపి గురుమూర్తి తెలిపారు. తిరుపతి నగర విస్తరణతో ట్రాఫిక్ భారీగా పెరిగిన నేపథ్యంలో ప్రస్తుతం నిర్మిస్తున్న అండర్ బ్రిడ్జ్కు పాత హీరోహోండా షోరూం వద్ద రైల్వే గేట్ నంబర్ 107 వైపు మాత్రమే యాక్సెస్ ఉండటంతో భవిష్యత్తులో వాహనదారులకు ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందని ముందుచూపుతో ఎంపీ గురుమూర్తి గుర్తించారు. అందుకే కాటన్ మిల్ గేట్ నంబర్ 108 వైపుగా కూడా అదనపు యాక్సెస్ రోడ్డు అవసరమని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్కుమార్ శ్రీవాస్తవకి లేఖ రాశారు.ఎంపీ ప్రతిపాదనపై రైల్వే శాఖ సాధ్యాసాధ్యాల పరిశీలన జరిపి యాక్సెస్ రోడ్డు ఏర్పాటు సాధ్యమని తేల్చింది. ఈ మేరకు రైల్వే జీఎం ఎంపీకి లేఖ ద్వారా సమాచారం అందించారు. ఈ నిర్ణయంతో తిరుపతి-రేణిగుంట మార్గం నుండి మంగళం, లీలామహల్ సర్కిల్ వైపుకు వాహనాలు సులభంగా వెళ్లే అవకాశం కలుగుతుందని ఎంపీ గురుమూర్తి తెలిపారు. ప్రజా ప్రయోజనాన్ని దష్టిలో ఉంచుకొని రైల్వే శాఖ ఈ నిర్ణయం తీసుకోవడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు

16న అమ్మవారి బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ

ప్రజాశక్తి - తిరుపతి సిటి

తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి ఆలయంలో నవంబరు 17 నుండి 25వ తేదీ వరకు జరగనున్న వార్షిక కార్తీక బ్రహ్మోత్సవాలకు నవంబరు 16వ తేదీ అంకురార్పణ జరగనుంది. ఈ సందర్భంగా ఉదయం 8 నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు లక్ష కుంకుమార్చన నిర్వహిస్తారు. సాయంత్రం 6 నుండి రాత్రి 8.30 గంటల వరకు పుణ్యాహవచనం, రక్షాబంధనం, సేనాధిపతి ఉత్సవం, యాగశాలలో అంకురార్పణ కార్యక్రమాలు చేపడతారు.

నృత్య సంప్రదాయాల సమ్మేళనం 'నృత్యవాహిని'

ప్రజాశక్తి - క్యాంపస్

శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో 'నత్య వాహిని' కార్యక్రమం మూడు రోజుల పాటు జరగనుంది. అంతర్జాతీయ సాంస్కతిక మార్పిడి నత్య మహోత్సవం (ఇంటర్నేషనల్ కల్చరల్ ఎక్స్ఛేంజి డాన్స్ ఫెస్టివల్) ప్రారంభోత్సవ సభ ఇందిరా ప్రియదర్శిని ఆడిటోరియంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథి మైసూరు విశ్వవిద్యాలయంకు చెందిన ప్రొఫెసర్ హెచ్.కె. శీల శ్రీధర్ (కర్ణాటక కలాశ్రీ), గెస్ట్ ఆఫ్ హానర్గ వర్శిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎన్. రజని, కన్వీనర్ ప్రొఫెసర్ పి. విజయలక్ష్మి (డీన్ ఇంటర్నేషనల్ అఫైర్స్), ఆర్గనైజింగ్ సెక్రటరీ డా. హిమబిందు హాజరయ్యారు. వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ వి. ఉమ మాట్లాడుతూ నత్యం ప్రాముఖ్యతను వివరిస్తూ వివిధ డాన్స్ ఫార్మ్, నత్యంనకు మూలమైనటువంటి ఆదిపురుషుడు శివభగవానుడి నుండి జాలువారి అది అందిరి జీవితాలలో ఒక భాగమై , చెకూర్చే ప్రశాంతతను, విశ్వాన్ని మొత్తం తన నాట్యంతో ఎలా అనుసంధానం చేస్తున్నారో తెలిపారు. తొలితగా శ్రీలంకకు చెందిన కాండియన్ డాన్స్, మధ్యాహ్నం మహారాష్ట్ర నాసిక్కు చెందిన కథక్ నృత్యం అలరించాయి.

కుట్టు మిషన్లు పంపిణి

ప్రజాశక్తి -తిరుపతి టౌన్

సోషల్ ఇంటిగ్రేటెడ్ రూరల్ డెవలప్మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో ఏకం యూఎస్ఏ వారి ఆర్థిక సహకారంతో 30 మంది మహిళలకు కుట్టు మిషన్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా అదనపు సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ ఏ ఆర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ ఇంటికి దీపం ఇల్లాలు మహిళలు ఆర్థిక స్వాతంత్రం సాధిస్తేనే ఆ కుటుంబం బాగుపడుతుందని కుట్టు శిక్షణా వత్తిలో నైపుణ్యాన్ని పెంపొందించుకుని కషితో పని చేస్తే గుర్తింపు అవకాశాలు స్వయంగా వస్తాయని తెలియజేశారు. అలాగే ఈ కార్యక్రమంలో డిఎస్పి ఏఆర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ మహిళలు నైపుణ్యం పెంపొందించుకుంటేనే ఆర్థికంగా అభివద్ధి చెందుతారని మహిళలు నైపుణం ఉంటే 100 కి కుట్టే బట్టలు కూడా 500 రూపాయలకు వరకు సంపాదించవచ్చు అని తెలిపారు. అలాగే మహిళలకు కుట్టు మిషన్లు అందజేసిన ఏకం (యుఎస్ఎ) వారికి ధన్యవాదాలు తెలియజేశారు ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామీణాభిరుద్ధి సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ శోభన్ బాబు పాల్గొన్నారు.

164 కొత్త పోలింగ్ కేంద్రాలకు ప్రతిపాదనలు

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ప్రత్యేక ఇంటెన్సివ్ పునర్విమర్శ 2025లో భాగంగా 1200 ఓటర్లు దాటిన పోలింగ్ కేంద్రాలు ఎన్ని ఉన్నాయో గుర్తించి 164 కొత్త పోలింగ్ కేంద్రాల ప్రతిపాదనలు తయారు చేయాలని కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్ ఆదేశించారు. గురువారం స్థానిక కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాలు నందు ఇంచార్జ్ జాయింట్ కలెక్టర్ , నగర పాలక సంస్థ మున్సిపల్ కమిషనర్ మౌర్య, ట్రైనీ కలెక్టర్ సందీప్ రఘు వాన్షి , డి ఆర్ ఓ నరసింహులు, స్పెషల్ డిప్యూటి కలెక్టర్ లు రోజ్మాండ్, సుధా రాణి, తిరుపతి, శ్రీ కాళహస్తి ఆర్ డి ఓ లు రామ్మోహన్, భాను ప్రకాష్ రెడ్డి, నియోజక వర్గాల తాసిల్దార్లు, జిల్లాలోని గుర్తింపు పొందిన అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో పోలింగ్ కేంద్రాల సరళీకరణ తదితర అంశాలపై జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి వెంకటేశ్వర్ సమావేశం నిర్వహించారు. జిల్లాలోని ఏడు నియోజక వర్గాల్లో 38 పోలింగ్ కేంద్రాలలో ప్రాంతాల మార్పు, 9 పోలింగ్ కేంద్రాల పేర్లు మార్పు, 164 నూతన పోలింగ్ కేంద్రాల గుర్తింపు, 44 పోలింగ్ కేంద్రాల విలీనం చేయడం వలన జిల్లాలో గతంలో ఉన్న 2141 పోలింగ్ కేంద్రములకు గాను 2261 పెరుగుతాయని తెలిపారు. ఈ మేరకు జిల్లాలోని అన్ని రాజకీయ పార్టీల వారిని అభ్యంతరాలు ఏమన్నా ఉంటే తెలపాలని సూచించారు.

లక్ష్యాన్ని నిర్దేశించుకుని పారిశ్రామికవేత్తలుగా ఎదగండి

ప్రజాశక్తి- వరదయ్యపాలెం

లక్ష్యాన్ని నిర్దేశించుకుని పారిశ్రామికవేత్తలుగా ఎదగాలన్న మీ కలలను సాకారం చేసుకోండంటూ జాగతి యాత్రికులకు శ్రీసిటీ ఎండీ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి దిశానిర్దేశం చేశారు. జాగతి యాత్ర దేశ వ్యాప్త పర్యటనలో భాగంగా 525 మంది యువ యాత్రికులు శ్రీసిటీ చేరుకున్నారు. వీరు రోల్ మోడల్ గా ఎంచుకున్న డాక్టర్ సన్నారెడ్డి బుధవారం రాత్రి శ్రీసిటీలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో సభ్యులతో సమావేశమై స్ఫూర్తిదాయక ప్రసంగం చేశారు. 1990 దశకంలో అమెరికాలో మొదలైన తన పారిశ్రామిక ప్రయాణం భారతదేశంలో శ్రీసిటీగా ఎలా విస్తరించిందో వివరించారు. షెన్జెన్, జురాంగ్ వంటి ప్రపంచ స్థాయి పారిశ్రామిక నగరాల ప్రేరణతో "వర్క్, లివ్, లెర్న్, ప్లే" విధానంతో ప్రపంచ వ్యాపార కేంద్రంగా తీర్చిదిద్దిన తీరును ప్రస్తావించారు. 2008 ప్రపంచ ఆర్థిక సంక్షోభాన్ని ఒక ఎదురుదెబ్బగా అందరూ భావించారని, పున్ణనిర్మాణానికి ఉత్ప్రేరకంగా శ్రీసిటీ స్పందించిందన్నారు. జాగతి యాత్రి సీఓఓ చిన్మయ్ వాడ్నేటే ప్రశ్నోత్తరాల కార్యక్రమ వ్యాఖ్యాతగా వ్యవహరించారు

బీమా నగదు చెల్లింపు

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ ఏర్పాటు చేసిన తెలుగుదేశం పార్టీ - కార్యకర్తల సంక్షేమ విభాగం నుండి రూ.5,00,000 రూపాయల ఆర్థిక సహాయం బాధితులకు మంజూరు చేయబడింది. వడమాలపేట మండలం, ఎస్‌వి పురం గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త తిరుమల సుధాకర్ ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. ఈ నేపథ్యంలో కార్యకర్తల ప్రమాద బీమా ప్రయోజనాల కోసం అవసరమైన పత్రాలను సేకరించి, నగరి ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్ రాష్ట్ర కార్యాలయానికి పంపారు. వెరిఫికేషన్ ప్రక్రియ పూర్తయిన తరువాత, విడుదలైన మొత్తాన్ని తిరుమల సుధాకర్ భార్య తిరుమల నాగభూషణకు రూ.5,00,000 ఆర్థిక సహాయం ఎమ్మెల్యే స్థానిక నాయకులతో కలిసి అందజేశారు. ఆయన వెంట టిడిపి నాయకులు ఉమాపతి, జిల్లా నాయకులు, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

సదరం సర్టిఫికెట్స్‌కు దరఖాస్తు చేసుకోండి

ప్రజాశక్తి - శ్రీకాళహస్తి రూరల్ (తొట్టంబేడు): సదరం సర్టిఫికెట్ కోసం అర్హులైన వారు దరఖాస్తులు చేసుకోవడానికి ప్రభుత్వం నుంచి ఆదేశాలు జారీ అయ్యాయని ఎంపీడీవో సురేంద్రనాథ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలో ఉన్న దివ్యాంగులు వైకల్య నిర్ధారణ ధ్రువపత్రం కోసం వారి పంచాయితీ పరిధిలోని గ్రామ సచివాలయాల్లో స్లాట్ బుక్ చేసుకోవాలని తెలిపారు. నవంబర్, డిసెంబర్ నెలల్లో స్లాట్ బుకింగ్ చేసుకునే అవకాశం ఉందని అర్హులైన వారు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సదరం సర్టిఫికెట్ ఉంటేనే వికలాంగులకు పెన్షన్ అందుతుందన్నారు.

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: మండలంలోని అర్హులైన దివ్యాంగులకు సదరం సర్టిఫికెట్ కోసం దరఖాస్తు చేసుకోవడానికి ప్రభుత్వం నుంచి ఆదేశాలు జారీ అయ్యాయని ఎంపీడీవో వెంకటరత్నమ్మ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలో ఉన్న దివ్యాంగులు వైకల్య నిర్ధారణ ధ్రువపత్రం కోసం వారి పంచాయితీ పరిధిలో ఉన్న గ్రామ సచివాలయాల్లో స్లాట్ బుక్ చేసుకోవాలని తెలిపారు.

నరసింహరాజు మృతికి నివాళి

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : వడమాల పేట మండలం, ఎస్‌బిఆర్ పురం గ్రామానికి చెందిన ముద్దులూరు నరసింహరాజు (బాబు రాజు) రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్ వారి స్వగ్రామానికి చేరుకుని ఆయనకు నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో టీడీపీ కార్యకర్తను కోల్పోవడం చాలా బాధాకరమన్నారు. వారి కుటుంబానికి టిడిపి అండగా ఉంటుందని భరోసా కల్పించారు. ఆయన వెంట ఎస్‌బిఆర్ పురం సర్పంచ్ మణిరాజు, టిడిపి నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

భరద్వాజ తీర్థంలో మరుగుదొడ్లు నిర్మించండి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : శ్రీకాళహస్తీశ్వర స్వామి దేవస్థానానికి అనుబంధంగా ఉన్న భరద్వాజతీర్థంలో భక్తులు, పర్యాటకుల సౌకర్యార్థం మరుగుదొడ్లు నిర్మించాలని హిందూ ధార్మిక మండలి సభ్యులు విజ్ఞప్తి చేశారు. గురువారం వారు భరద్వాజ తీర్థాన్ని పరిశీలించారు. తీర్థానికి భక్తులు, పర్యాటకుల రాక నానాటికీ పెరుగుతున్న నేపథ్యంలో తాగునీరు, మరుగుదొడ్ల ఏర్పాటు అవసరమన్నారు. భరద్వాజ తీర్థం సమీపంలోనే ఏళ్ల కిందట కొన్ని మరుగుదొడ్లు నిర్మించిన అవి నిరుపయోగంగా ఉన్నాయని హిందూ ధార్మిక మండలి శ్రీకాళహస్తి డివిజన్ కన్వీనర్ గరికపాటి రమేష్ బాబు తెలిపారు.

ఎంపీడీవో దివాకర్ బాధ్యతలు స్వీకరణ

ప్రజాశక్తి - యర్రావారిపాలెం: యర్రావారి పాలెం మండలం ఎంపీడీవోగా కె.దివాకర్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. సత్యసాయి జిల్లా మడకశిర మండలంలో డిప్యూటీ ఎంపీడీవోగా పనిచేస్తూ ప్రమోషన్‌పై ఎంపీడీవో ఎర్రావారి పాలెం మండలానికి విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని సమస్యలపై ప్రజలు అండగా చూడాలని, పారిశుద్ధ్య పనులపై దృష్టి పెట్టాలని సిబ్బందికి సూచించారు.

ప్రిన్సిపాల్ తీరుపై నేడు ధర్నా

ప్రజాశక్తి - సత్యవేడు: సత్యవేడు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యను అభ్యసిస్తున్న ద్వితీయ సంవత్సరం, చివర సంవత్సరం విద్యార్థుల పరీక్ష ఫీజులను కట్టించుకోకుండా వేధిస్తున్న ప్రిన్సిపాల్ తీరుపై కళాశాల ఆవరణ ముందు రోడ్డుపై శుక్రవారం నిరసన కార్యక్రమం చేపట్టనున్నట్లు విద్యార్థులు గురువారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ఈ నిరసన కార్యక్రమానికి సిపిఎం పార్టీ తమ మద్దతును తెలిపింది. విద్యార్థులు సమస్యలపై మండల కేంద్రంలోని సిపిఎం పార్టీ కార్యాలయంలో ప్రాంతీయ కార్యదర్శి మెలుగు రమేష్ మీడియా సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పరీక్ష ఫీజులు కట్టించుకోవడానికి శుక్రవారం చివరి గడువు కాగా, ఇంతవరకు ఫీజులు కట్టించుకోకపోవడం ఏంటని ప్రశ్నించారు. తనకు అనుకూలంగా ఉన్న కొంత మంది వద్దే ఫీజులు కట్టించుకోవడం ప్రధానోపాధ్యాయులకి తగదన్నారు. గురువారం విద్యార్థులు సిపిఎం పార్టీ కార్యాలయాన్ని ఆశ్రయించి తమ ఆవేదన తెలియజేశారన్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణ రోడ్డుపై శుక్రవారం నిరసన కార్యక్రమం చేపట్టనున్నట్లు తెలిపారు.

ఎన్టీఆర్ వారసులవుదాం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : తెలుగుదేశం పార్టీని స్థాపించి తెలుగువారి ఆత్మగౌరవాన్ని నలు దిశలా వ్యాపింపజేసిన మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు వారసులుగా మనమంతా ముందుకెళ్లాలని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి పిలుపునిచ్చారు. ఎన్టీఆర్‌కు నివాళి అర్పించి, అధ్యక్షుల చేత ప్రమాణం చేయించారు. స్థానిక ఎన్టీఆర్ భవన్‌లో శ్రీకాళహస్తి పట్టణ అధ్యక్షులుగా విజయకుమార్ నాయుడు, తొట్టంబేడు మండల పార్టీ అధ్యక్షులుగా రావిళ్ల మునిరాజ నాయుడు ప్రమాణ స్వీకారం చేశారు. సీఎం చంద్రబాబు నాయుడు ఆదేశాలమేరకు ప్రతి కార్యకర్త నడవాలని ఎమ్మెల్యే సూచించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మైనారిటీల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : ఇమామ్, మౌజన్‌ల గౌరవ వేతనాల కోసం రూ.90 కోట్లు మంజూరు చేసిన శుభ సందర్భంగా పుత్తూరు పట్టణ ముస్లిం మైనారిటీ సోదరులు సీఎం చంద్రబాబుకు ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా మైనారిటీ నాయకులు ముత్తు వల్లి మహమ్మద్ గౌస్ మాట్లాడుతూ ఇమామ్‌లకు నెలకు 10000 రూపాయలు, మౌజన్‌లకు 5000 రూపాయలు గౌరవ వేతనాలు చెల్లించడంపై హర్షం వ్యక్తం చేశారు. మైనారిటీల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో నగరి నియోజకవర్గ పుత్తూరు పట్టణ మైనారిటీ సెల్ టిడిపి నాయకులు, కార్యకర్తలు, ముస్లిం మైనారిటీ సెల్ సభ్యులు పాల్గొన్నారు.

బాలాజీ రైల్వే డివిజన్ ఏర్పాటుకు కృషి చేయండి

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: తిరుపతి బాలాజీ రైల్వే డివిజన్ ఏర్పాటుకు కృషి చేయాలని బాలాజీ రైల్వే డివిజన్ సాధన కమిటీ కన్వీనర్ కుప్పల గిరిధర్ కుమార్ గురువారం టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు వర్ల రామయ్యకు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా కుప్పల గిరిధర్ కుమార్ మాట్లాడుతూ రాయలసీమలోని తిరుపతి జిల్లా రైల్వే అభివృద్ధి పరంగా చాలా వెనకబడి ఉందని రైల్వే డివిజన్ ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. టిడిపి పొలిట్ బ్యూరో వర్ల రామయ్య మాట్లాడుతూ ఈ విషయం సీఎం దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తిరుపతి ఫిల్మ్ సొసైటీ చైర్మన్ యం.విజయసారథి రెడ్డి, బాలాజీ డివిజన్ కన్వీనర్ కుప్పల గిరిధర్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బాలికల వసతి గృహాలలో..

సంక్షేమం ఎక్కడ?

■ సుమారు 400 మంది విద్యార్థినులకు రెండే బాత్‌రూములు ■ సగానికి పైగా విరిగిన బాత్ రూమ్ తలుపులు ■ నాశిరకం భోజనం, పాలు

ప్రజాశక్తి - చంద్రగిరి: చంద్రగిరిలో బాలికల సంక్షేమ వసతి గృహాలలో వసతుల లేమితో అధ్వాన్నమైన పరిస్థితులు నెలకొన్నాయి. మరుగు దొడ్లు, స్నానాల గదులు అపరిశుభ్రంగా ఉన్నాయని, నీటి సరఫరా కూడా సరిగాలేదని విద్యార్థినులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరుగు దొడ్లు, స్నానాల గదులకు తలుపులు కూడా సరిగా లేవని తెలిపారు. హాస్టల్‌లో ఉంటున్న విద్యార్థులందరికీ స్నానాల గదులు రెండే ఉండడంతో ఇబ్బంది పడుతున్నారు. ఆదివారం, సెలవు దినాల్లో నిత్యావసరాలకు నీరు కూడా ఉండదని అసహనం వ్యక్తం చేస్తున్నారు. స్నానాలు చెయ్యాలన్నా, బట్టలు ఉతుక్కోవాలన్నా ఇబ్బందిగా ఉంటోందని విద్యార్థినులు తెలిపారు. నాణ్యతలేని భోజనాలు, పాలు పంపిణీ చేస్తున్నారని, గతంలో ఈ విషయం పలుమార్లు అధికారులకు తెలియజేశామని తెలిపారు. మధ్యాహ్నం పూట స్కూల్లో భోజనం చేస్తామని అక్కడ భోజనం బాగుంటుందని, అదేవిధంగా హాస్టల్లో కూడా మంచి భోజనం, పాలు ఇవ్వాలని విద్యార్థినులు కోరుతున్నారు. మెను పాటించక, నాశిరకం ఆహారం అందిస్తున్నట్లు తెలిపారు. వసతి గృహాలను పర్యవేక్షించే సిబ్బంది కొరత ఉందని, వార్డెన్లు సమయానికి అందుబాటులో ఉండటం లేదని విద్యార్థినుల తల్లిదండ్రులు తెలిపారు. పాత భవనాలు శిథిలావస్థకు చేరుకోవడం, విద్యార్థుల సంఖ్యకు తగ్గట్టు గదులు, మరుగుదొడ్లు లేకపోవడం, సరైన తాగునీరు, ఫ్యాన్లు, లైటింగ్ వంటి ప్రాథమిక సౌకర్యాలు లేవని విద్యార్థినిలు ఆవేదన చెందుతున్నారు. ప్రభుత్వం ఈ సమస్యలను పరిష్కరించడానికి కృషి చేస్తోందని, కొత్తగా నిధులు మంజూరు చేసిందని, అధికారులకు తనిఖీలు చేపట్టాలని ఆదేశించిందని బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత చెబుతూనే ఉన్నారు. మెరుగైన మౌలిక సదుపాయాలు, ఆహార నాణ్యత కోసం చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు చెబుతూనే ఉన్నారు. పర్యవేక్షణ ఎక్కడ, సదుపాయాలూ ఎక్కడని విద్యార్థినులు, తల్లిదండ్రుల ప్రశ్నిస్తున్నారు.

మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ ఆపాలి

ప్రజాశక్తి - వెంకటగిరి టౌన్: పిడిఎస్‌ఓ ఏరియా మహాసభ గురువారం పట్టణంలోని పింజల వీరయ్య కళ్యాణమండపంలో పిడిఎస్‌ఓ నాయకులు సిహెచ్ పవన్ అధ్యక్షతన గురువారం నిర్వహించారు. ఏపీటీఎఫ్ సీనియర్ నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వం వైద్య కళాశాలలను ప్రైవేట్ సంస్థలకు అప్పగించడం విద్యను వ్యాపారంగా మార్చే కుట్ర అని పేర్కొన్నారు. జీవో 107, 108లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. స్త్రీ విముక్తి సంఘటన రాష్ట్ర నాయకులు కె. అజిత మాట్లాడుతూ విద్యార్థులు విద్యా రంగ సమస్యల పరిష్కారం కోసం పోరాటం చేయాలన్నారు. తిరుపతి జిల్లా పిడిఎస్‌ఓ కార్యదర్శి ఆర్.ఆష మాట్లాడుతూ ప్రభుత్వం విద్యా సంస్కరణల పేరుతో ప్రభుత్వ పాఠశాలలను మూసివేస్తూ, విద్యా వ్యవస్థను బలహీనపరుస్తున్నారని ఆరోపించారు. ఈ సందర్భంగా ఏరియా కమిటీ సభ్యులును ఎన్నుకున్నారు. సిహెచ్ పవన్ కన్వీనర్‌గా, మనోజ్, తేజు, లక్ష్మి నరసింహ, శ్రీను, ప్రవళిక, దేవి, భవాని కమిటీ మెంబర్లుగా ఎన్నికయ్యారు. అనంతరం విద్యార్థులు ర్యాలీగా విశ్వోదయ క్రీడా ప్రాంగణం నుంచి భ్రమరాంబా సెంటర్ మీదగా వెళ్లి, తిరిగి పింజల వీరయ్య కళ్యాణ మండపానికి చేరుకున్నారు.

కష్టపడినవారికి పార్టీలో గుర్తింపు

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : పార్టీ అధికారంలోకి రావడానికి కష్టపడి పనిచేసిన వారిని ఎప్పటికీ తెలుగుదేశం పార్టీ మర్చిపోదని ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ స్పష్టం చేశారు. గూడూరు టీడీపీ కార్యాలయంలో గురువారం ఎమ్మెల్యే సునీల్ కుమార్ ఆధ్వర్యంలో మండల క్లస్టర్, యూనిట్, గ్రామ బూత్ కమిటీల ప్రమాణ స్వీకార కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల్లోని సమస్యలను తనకు తెలియజేస్తే పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. కూటమి నాయకులు సమష్టి కృషితో ముందుకు వెళ్లాలని సూచించారుఉ. గూడూరు నియోజకవర్గంలో ప్రతి నెల 16 కోట్ల రూపాయలు పెన్షన్లు అందిస్తున్నామని, ఇప్పటివరకు సీఎం సహాయ నిధి నుండి, 3 కోట్ల రూపాయలు బాధితులకు ఇవ్వడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర నాయకులు శీలం కిరణ్ కుమార్, గూడూరు పట్టణం, రూరల్ చిల్లకూరు, కోట, వాకాడు, చిట్టమూరు, మండలాల అధ్యక్షులు పులిమి శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు నాయుడు, దువ్వూరు రాజశేఖర్ రెడ్డి, బిల్లు చెంచురామయ్య, రహీం, తిరుపతి పార్లమెంట్ కార్యదర్శి పట్టాభిరామిరెడ్డి, మహిళా నాయకులు గుండాల లీలావతి, మట్టం శ్రావణి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విధుల పట్ల నిర్లక్ష్యం.. షోకాజ్ నోటీసులు జారీ

ప్రజాశక్తి - వాకాడు: వాకాడు మండల కార్యాలయంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి సాయి ప్రసాద్ ఆధ్వర్యంలో గురువారం మండలంలోని అన్ని పంచాయతీల కార్యదర్శులతో రివ్యూ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో అన్ని సచివాలయాల జి.ఎస్.డబ్ల్యూ.ఎస్‌లోని వివిధ పెండింగ్ సర్వేలపై (ముఖ్యంగా సిటిజన్ ఈ.కే.వై.సీ, కౌశలం) పై రివ్యూ చేయడం జరిగింది. ఈ సర్వేలలో ఎటువంటి అవకతవకలు, అలసత్వం లేకుండా సకాలంలో పూర్తి చేయాలని, జిల్లా పరిధిలోని మండలాన్ని ప్రథమ స్థానంలో ఉంచాలని, ఈ సర్వేలలో ఏమైనా అవాంతరాలు ఉంటే తెలియ చేయాలని ఎంపీడీవో పంచాయతీ కార్యదర్శులకు తెలియజేశారు. అనంతరం పంచాయతీలోని వివిధ సమస్యలపై చర్చించారు. ఈ రివ్యూ మీటింగ్‌లో మొత్తం 12 సచివాలయాలకు గాను ఎనిమిది సచివాలయాల పంచాయతీ కార్యదర్శులు మాత్రమే హాజరయ్యారని ఎంపీడీవో తెలిపారు. గైర్హాజరైన వారికి షోకాజ్ నోటీసులు ఇవ్వాలని సిబ్బందిని ఆదేశించారు. ఈ సమావేశంలో డిప్యూటీ ఎంపీడీవో ఎన్ దేవదానం, కార్యాలయం ఏ.వో సి శ్రీనివాసులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

అరణియార్‌లోకి చేప పిల్లలు విడుదల

ప్రజాశక్తి - పిచ్చాటూరు: అరణియార్ రిజర్వాయంలో వరుసగా ఏడు సార్లు చేప పిల్లలు వదలడం తన అదృష్టంగా భావిస్తున్నాని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం సంతోషం వ్యక్తం చేశారు. గురువారం పిచ్చాటూరు అరణియార్ పాత గేట్ల వద్ద అధికారులు, మత్స్య కార్మిక సంఘం నేతలతో కలిసి ఎమ్మెల్యే చేతుల మీదుగా 6 లక్షల చేప పిల్లలను తొలివిడతగా జలాశయంలో వదిలారు. ఆయన మాట్లాడుతూ వరదలతో నష్టపోయిన మత్స్యకార్మిక కుటుంబాలకు ప్రభుత్వం మంజూరు చేసిన నిత్యావసర సరుకులు పంపిణీ చేయాలని అధికారులను ఆదేశించారు. సబ్సిడీ వలలు, బోట్లు, సైకిళ్ల పంపిణీ చేయాలని అరణియార్ మత్స్య కార్మికులు ఎమ్మెల్యేను కోరగా, అధికారుల ద్వారా తప్పక నివేదిస్తామని హామీ ఇచ్చారు. జపాన్ ఇండస్ట్రీస్ కో ఆపరేటివ్ అసిస్టెన్స్(జైకా) నిధులు రూ.35 కోట్లతో గతంలో ప్రారంభించిన పనులు పదిశాతం మాత్రమే పూర్తి చేసి కాంట్రాక్టర్ చేతులెత్తేశారని తెలిపారు. ఇంకా రూ.28 కోట్లు మిగిలి ఉందని, గత కాంట్రాక్ట్‌ను రద్దు చేసి, ఈ నిధులకు మళ్లీ టెండర్లు ప్రక్రియ పూర్తి చేసి పనులు చేపట్టాలని, ఈ విషయాన్ని అసెంబ్లీలో ప్రస్తావించి ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లానని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఎఫ్‌ఓ శాంతి, ఎఫ్.డి.ఓ మధుసూదన్, అంజర్వర్ రవికుమార్, ఉమ్మడి చిత్తూరు జిల్లా మత్స్య కార్మిక సంఘం అధ్యక్షుడు రత్నం తదితరులు పాల్గొన్నారు.

అక్రమ కట్టడాలు చేపట్టారని తప్పుడు ఫిర్యాదు

ప్రజాశక్తి - చంద్రగిరి : చంద్రగిరి మండలం, ముంగిలిపట్టు పంచాయతీ, కొంగరవారిపల్లిలో రైల్వే స్థలంలో అక్రమ కట్టడాలు చేపట్టారని ఓ మహిళ తప్పుడు ఫిర్యాదు చేసింది. ఈ ఫిర్యాదుతో ఘటనా స్థలానికి రైల్వే పోలీసులు, సిబ్బంది చేరుకున్నారు. కొన్ని సవత్సరాలుగా ప్రజలు నివసిస్తున్న ఆ ప్రదేశాల్లో రైల్వే అధికారులు చెట్లను తొలగించారు. స్థానిక నాయకుల ద్వారా విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే పులివర్తి నాని ఘటనా స్థలానికి చేరుకొని పనులను నిలుపుదల చేశారు. స్థానికులకు అండగా నిలబడి విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు.

లైసెన్స్ ఉన్నా లాక్

■ పుత్తూరులో గౌడ సంఘం మద్యం షాపు ప్రారంభానికి అడ్డంకులు

■ బెల్ట్ షాపుల నిర్వహకులే అడ్డుకుంటున్నారని కలెక్టర్‌కు ఫిర్యాదు

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న గౌడ సంఘం నేతలు

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్, మంగళం : రాష్ట్ర ప్రభుత్వం నూతన మద్యం పాలసీ ద్వారా గౌడ సామాజిక వర్గానికి సంబంధించిన వారికి మద్యం షాపులు కేటాయిస్తే, దానిని నగిరి నియోజక వర్గంలో లైసెన్సు షాపును తెరవనికుండా బెల్ట్ షాపుల నిర్వాహకులు అడ్డపడుతున్నారని వీరిపై చర్యలు తీసుకోవాలని లైసెన్స్ దారు అత్తరాల నారాయణ జిల్లా కలెక్టర్ కు విజ్ఞప్తి చేశారు. గురువారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో విలేకరుల సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం తిరుపతి జిల్లా అధ్యక్షులు కల్లూరు నాగరాజా గౌడ్ తో కలిసి మాట్లాడారు. లైసెన్సు మద్యం షాపు పొందిన నాటి నుండి నేటి వరకు షాపు ఎక్కడ ఏర్పాటు చేసిన అడ్డంకులు సృష్టిస్తూ ఇబ్బందులకు గురి చేస్తున్నారని, రాత్రింబవళ్లు మద్యం అమ్మకాలు జరిపే బెల్టు షాపుల నిర్వాహకులు బెదిరింపులకు దిగడం, షాపును తెరవనీయకుండా చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై ఇప్పటికే జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేసిన ఫలితం లేకుండా పోయిందన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి షాపు తెరిచేలాగా చర్యలు తీసుకోని బెల్ట్ షాపు నిర్వాహకులపై కఠినంగా వ్యవహరించాలని విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. ఈ విలేకరుల సమావేశంలో అత్తిరాల శ్రీరాములు గౌడ్, సత్యనారాయణ గౌడ్, రాంబాబు గౌడ్, పురుషోత్తం గౌడ్, శ్రీనివాసులు గౌడ్, రామయ్య గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

యూత్ యాక్టివిటీస్‌లో ఎంజిఎం విద్యార్థుల సత్తా

ప్రజాశక్తి - శ్రీకాళహస్తి: రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన యూత్ యాక్టివిటీస్-2025 పోటీల్లో ఎంజిఎం ఇంగ్లీష్ మీడియం స్కూల్ విద్యార్థులు సత్తా చాటారు. వక్తృత్వపు పోటీల్లో 7వ తరగతి చెందిన ఉన్నతి మొదటి బహుమతి, సీనియర్ డ్రాయింగ్ పోటీల్లో 10వ తరగతికి చెందిన, హర్షవర్ధన్ రెండో బహుమతి, ఫ్యాన్సీ డ్రెస్ కాంపిటీషన్ లో 6వ తరగతికి చెందిన ఫర్జికా సంతోషిణి రెండో బహుమతి సొంతం చేసుకున్నారు. గురువారం వీరిని ఎంజీఎం సంస్థల డైరెక్టర్ గుడ్లూరు ఐశ్వర్య అభినందించారు.

సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాలలో క్యాంపస్ డ్రైవ్

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : పుత్తూరు, సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాలలో గురువారం ఉదయం ఇన్ఫోసిస్ క్యాంపస్ డ్రైవ్ ఘనంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమాన్ని ఆంధ్రప్రదేశ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అకాడమీ (అపిటా) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు కళాశాల యాజమాన్యం తెలిపారు. ఈ క్యాంపస్ డ్రైవ్‌లో తిరుపతి, ఉమ్మడి నెల్లూరు జిల్లాల నుంచి బీటెక్, ఎంసిఏ, ఎంఎస్సీ విభాగాల విద్యార్థులు పాల్గొన్నారు. మొత్తం 46 కళాశాలల నుంచి 600 మంది విద్యార్థులు హాజరైనట్లు అపిటా అధికారులు తెలిపారు. విద్యార్థులకు మొదట ఆన్‌లైన్ పరీక్షలు, అనంతరం ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎంపికైన అభ్యర్థులకు సంవత్సరానికి సుమారు నాలుగు లక్షల రూపాయల వేతనం అందనున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ అశోక్‌రాజు మాట్లాడుతూ విద్యార్థులు తమ లక్ష్య సాధనలో పట్టుదలతో ముందుకు సాగాలని, కృషి, నిబద్ధతతో ఉద్యోగాలు సంపాదించి తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చాలని సూచించారు. విద్యార్థుల సౌకర్యార్థం కళాశాల తరపున వసతి, ఆహారం మరియు ఇతర సదుపాయాలను కల్పించినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ జనార్ధనరాజు, అపిటా మేనేజర్లు లక్ష్మీప్రసాద్, అనిల్, ఇన్ఫోసిస్ బృంద సభ్యులు దిశా, ప్రియాంద్రి, ప్లేస్‌మెంట్ అధికారులు, అధ్యాపకులు, వాలంటీర్లు పాల్గొన్నారు.

గ్రంథాలయ వారోత్సవాలు ప్రారంభం

ప్రజాశక్తి - చంద్రగిరి: చంద్రగిరి, శాఖాగ్రంథాలయంలో శుక్రవారం నుండి గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహించనున్నట్లు గ్రంథాలయ అధికారిణి రెడ్డెమ్మ తెలిపారు. 14వ తేది వారోత్సవాలు ప్రారంభిస్తామని, 15న పుస్తక ప్రదర్శన, 16న గ్రంథాలయ ఉద్యమంలో ప్రముఖుల పాత్ర పోషించిన వారిని స్మరించుట, 17న కవి సమ్మేళనము, 18న విధ్యార్ధులకు వానసరచన పోటీలు, 19న దిశ చట్టంపై విద్యార్థులకు అవగాహన, 20వ తేది పోటీలలో గెలుపొందిన వారికి బహుమతులు ప్రదానం ఉంటుందన్నారు. వారోత్సవాల సందర్భంగా గతంలో పాఠకులు తీసుకొని పోయిన పుస్తకాలు తిరిగి ఇచ్చిన యెడల ఆలస్య రుసుము, వసూలు చేయబోమని తెలిపారు. పాఠకులు గ్రంథాలయ సభ్యులుగా చేరి, ఈ వారోత్సవాలను విజయవంతం చేయాలని కోరారు.

విద్యుత్ ప్రమాదాల నివారణపై అవగాహన

ప్రజాశక్తి - తిరుపతి సిటీ : విద్యుత్ వినియోగదారులకు నాణ్యమైన, నిరంతరాయ విద్యుత్తును సరఫరా చేయాలనే లక్ష్యంతో అధికారులు విధులు నిర్వహించాలని ఎపిఎస్పిడిసిఎల్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ శివశంకర్ లోతేటి కోరారు. తిరుపతిలోని ఎపిఎస్పిడిసిఎల్ కార్పొరేట్ కార్యాలయంలో గురువారం సంస్థ పరిధిలో మొట్టమొదటిసారిగా చీఫ్ ఇంజనీర్ స్థాయి నుంచి డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ స్థాయి వరకు హాజరైన అధికారులతో సిఎండి శివశంకర్ లోతేటి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డయల్ యువర్ సిఎండి కార్యక్రమంలో సిబ్బంది అందిస్తున్న సేవలపై ఫిర్యాదులు అందుతున్నాయని, ఈ తరహా ఫిర్యాదులను తగ్గించేందుకు సిబ్బంది కృషి చేయాలని సూచించారు. సంస్థ పరిధిలో ట్రాన్స్‌ఫార్మర్ల ఫెయిల్యూర్స్ ఎక్కువగా నమోదయ్యాయని, వాటిని తగ్గించేందుకు తక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. సోలార్ విద్యుత్ వినియోగంపై చైతన్యవంతం కల్పించాలని కోరారు. సుదీర్ఘ కాలంగా పెండింగ్ వున్న విద్యుత్ బకాయిలను వసూలు చేసేందుకు ప్రాధాన్యతనివ్వాలన్నారు. ఎపిఎస్ పిడిసిఎల్ మొబైల్ యాప్‌ను సరళతరంగా వుండే విధంగా అభివృద్ధి చేశామని, ఈ అంశంపై వినియోగదారుల్లో అవగాహన పెంపొందించాలన్నారు. వినియోగదారులు విద్యుత్ సమస్యలపై టోల్ ఫ్రీ నంబరు: 1912 లేదా 1800 425 155333కు కాల్ చేయడం, చాట్‌బోట్ నంబరు: 91333 31912తో వాట్సాప్ చాట్ ద్వారా అధికారుల దృష్టికి తీసుకురావడం ద్వారా వాటిని త్వరితగతిన పరిష్కరించుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ (ప్రాజెక్ట్స్ అండ్ ఐటి) పి. అయూబ్ ఖాన్, డైరెక్టర్ (టెక్నికల్ అండ్ హెచ్‌ఆర్ డి) కె. గురవయ్య తదితర అధికారులు పాల్గొన్నారు.

డిజిటల్ గవర్నెన్స్ బలోపేతం చేస్తాం

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): మనమిత్ర వాట్సాప్ గవర్నెన్స్‌తో డిజిటల్ గవర్నెన్స్ ను బలోపేతం చేయడమే లక్ష్యంగా గ్రామ వార్డు సచివాలయ సిబ్బంది ప్రతి శుక్రవారం లేదా సెలవు దినాల్లో ప్రజల వద్దకు వెళ్లి మనమిత్ర వాట్సాప్ గవర్నెన్స్ ప్లాట్ ఫామ్ (9552300009) ఫోన్ నెంబర్‌పై అవగాహన కల్పిస్తూ ప్రయోజనాలను ప్రజలకు వివరించాలని జిల్లా గ్రామ, వార్డు సచివాలయ అధికారి జివి నారాయణరెడ్డి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. మనమిత్ర వాట్సాప్ గవర్నెన్స్ ప్లాట్ ఫామ్ ద్వారా 709 ప్రజా సేవలను ఇంటి వద్దనుండే ప్రజలు పొందేలా రూపొందించబడిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వ డిజిటల్ గవర్నెన్స్ లక్ష్యాన్ని చేరుకునేందుకు ఈ ప్రచార ప్రక్రియ జరుగుతుందని, దీనిని ఎంపీడీవోలు, మునిసిపల్ కమిషనర్లు అవగాహన కార్యక్రమాలను పర్యవేక్షిస్తారన్నారు.

పన్ను బకాయిలు వసూలు చేయండి : కమిషనర్

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: నగరంలో పెండింగ్‌లో ఉన్న పన్ను బకాయిలను వసూలు చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య రెవిన్యూ అధికారులను, కార్యదర్శులను ఆదేశించారు. నగరంలోని ఆస్తి పన్నుల వసూళ్ల పై గురువారం సాయంత్రం రెవిన్యూ అధికారులు, ఇన్స్పెక్టర్లు, సచివాలయ కార్యదర్సులతో కమిషనర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. వార్డుల వారీగా పెండింగ్ లో ఉన్న పన్ను బకాయిలను అధికారులు వివరించారు. మొండి బకాయిలు ఉన్న వాటికి నోటీసులు జారీ చేసి, అధికారులు, సిబ్బంది సమన్వయం చేసుకుని వెళ్లి వసూలు చేయాలని కమిషనర్ సూచించారు. ఈ సమావేశంలో డిప్యూటీ కమిషనర్ అమరయ్య, రెవిన్యూ అధికారులు సేతు మాధవ్, రవి, రెవిన్యూ ఇన్స్పెక్టర్లు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

మరిన్ని ఆధారాలు ఉన్నాయి : కిరణ్ రాయల్

ప్రజాశక్తి- తిరుపతి(మంగళం): శ్రీవారి లడ్డు కల్తీ నెయ్యి వ్యవహారానికి సంబంధించి మరిన్ని ఆధారాలు ఉన్నాయని, వాటిని త్వరలోనే సిట్ అధికారులకు ఇవ్వనున్నట్లు జనసేన పార్టీ తిరుపతి అసెంబ్లీ బాధ్యులు కిరణ్ రాయల్ తెలిపారు. గురువారం తిరుపతి ప్రెస్ క్లబ్లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వ హాయంలో టిటిడి చైర్మన్ కార్యాలయంలో పనిచేసిన ఉన్నతాధికారుల నుండి సిబ్బంది వరకు ఈ కల్తీ నెయ్యి వ్యవహారానికి సంబంధించి వాటాలు అందయని ఆరోపించారు. వీరికి సంబంధించిన ఆస్తులను, ఫోన్ కాల్ డేటాను పరిగణలోకి తీసుకొని విచారణ కొనసాగిస్తే కల్తీ వ్యవహారానికి సంబంధించి మరిన్ని వాస్తవాలు వెలుగులోకి వస్తాయన్నారు.

రూ. 3.10 లక్షలు పలికిన వినాయక సాగర్ ప్రవేశ రుసుం

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: కరకంబాడి రోడ్డులోని బొంతాలమ్మ గుడి వద్ద ఉన్న వినాయక సాగర్ పార్కు, గ్లో గార్డెన్ ప్రవేశరుసుము వసూలుకు వేలంలో 3,10,666 రూపాయలు పలికిందని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్. మౌర్య తెలిపారు. మూడు సంవత్సరముల కాల పరిమితికి లీజు పద్ధతిపై వేలం నిర్వహించినట్లు తెలిపారు.

క్రైం న్యూస్

తృటిలో తప్పిన ప్రమాదం

ప్రజాశక్తి - వరదయ్యపాలెం: అధిక లోడుతో వెళ్తున్న కంకర లారీ అదుపు తప్పి బోల్తా పడిన ఘటన మండలంలో గురువారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే వరదయ్యపాలెం నుంచి సత్యవేడు వైపు ఓవర్ లోడ్‌తో వెళ్తున్న కంకర లారీ యనాది వేట్టు గ్రామం వద్ద నిర్మాణంలో ఉన్న సిమెంటు రోడ్డుపై వెళ్తున్న క్రమంలో అదుపుతప్పి బోల్తా పడింది. ఆ సమయంలో ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. గత కొంతకాలంగా ఈ మార్గంలో తమిళనాడుకు అధిక లోడుతో అనేక టిప్పర్లు తిరుగుతున్నా, అధికారులు చూసి చూడనట్లు వ్యవహరించడంతో ఇటువంటి ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇక్కడ నిర్మాణంలో ఉన్న సిమెంట్ రోడ్డు పనులను కాంట్రాక్టర్ నెలలు తరబడి చేస్తూనే ఉన్నాడని, త్వరగా రోడ్డు పూర్తి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

లారీ దొంగ అరెస్టు

క్లీనర్ జయచంద్ర అరెస్ట్ చూపుతున్న పోలీసులు, లారీ స్వాధీనం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: డ్రైవర్ లేని సమయం చూసి లారీని అపహరించుకుపోయిన క్లీనర్‌ను గురువారం శ్రీకాళహస్తి టూ టౌన్ పోలీసులు అరెస్టు చేశారు. అతని వద్ద నుంచి లారీని స్వాధీనం చేసుకున్నారు. ఆ వివరాలను శ్రీకాళహస్తి డిఎస్పి నరసింహమూర్తి మీడియాకు వెల్లడించారు. ఈ నెల 7వ తేదీన టూ టౌన్ పోలీస్ స్టేషన్ సమీపంలోని లూథరన్ చర్చి వద్ద ఆపి ఉన్న లారీని డ్రైవర్ లేని సమయం చూసి క్లీనర్ జయచంద్ర అపహరించుకుపోయాడంటూ యజమాని మధుసూదన్ నాయుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆ మేరకు దర్యాప్తు చేపట్టిన పోలీసులు గురువారం పెద్దకన్నలి గిరిజన కాలనీ వద్ద క్లీనర్ జయచంద్రను అదుపులో తీసుకున్నారు. కేసు నమోదు చేసి రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరు పరిచినట్లు డిఎస్పి తెలిపారు. లారీ చోరీ కేసును ఛేధించిన టూ టౌన్ సీఐ నాగార్జున రెడ్డిని ఆయన అభినందించారు.

ఎర్రచందనం పట్టివేత

ప్రజాశక్తి - యర్రావారిపాలెం: అటవీ శాఖ అధికారులకు అందిన సమాచారం మేరకు రెండు వాహనాలతో సహా 25 లక్షలు విలువ చేసే ఎర్రచందనం పట్టుకోవడం జరిగిందని గురువారం అటవీశాఖ అధికారులు మీడియాకు ఒక ప్రకటనలో తెలిపారు. ఎర్రావారిపాలెం మండలం ఉస్తికాయల పెంట, ఎల్లమంద గ్రామ సమీప ప్రాంతాల నుండి అక్రమంగా ఎర్రచందనం తరలిస్తున్నారనే సమాచారం మేరకు తన సిబ్బందితో కలిసి అప్రమత్తమైనట్లు అటవీ శాఖ అధికారి ఎన్. వెంకటరమణ తెలిపారు. 12వ తేదీ బుధవారం తలకోన రోడ్డులోని పులకుంటపల్లి వద్ద రోడ్డు మార్గంలో 10 గంటల ప్రాంతంలో వాహనాలు తనిఖీలు చేస్తుండగా ఇన్నోవా కారును దుండగులు వదిలి పారిపోయారు. కారును పరిశీలించగా 300 కేజీలు ఎర్రచందనం దుంగలు బయటపడ్డాయని అధికారులు పేర్కొన్నారు. అదే తరహాలో 13వ తేదీ గురువారం ఉదయం 4, గంటల ప్రాంతంలో విఆర్ అగ్రహారం సబ్‌స్టేషన్ మార్గంలో మరొక కారును స్మగ్లర్లు వదిలి పారిపోయారు. కారును పరిశీలించగా ఐదు దుంగలు 153 కేజీల బరువు గల ఎర్రచందనం కొయ్యలను స్వాధీనం చేసుకున్నట్టు వారు తెలిపారు. స్వాధీనం చేసుకున్న మొత్తం ఎర్రచందనం కొయ్యల విలువ 25 లక్షలు ఉంటుందని అధికారులు అంచనా వేశారు. ఈ దాడిలో ఎఫ్ఎస్ఓ, మునిస్వామి నాయక్, ఎఫ్బిఓ లు, రాజేష్ కుమార్, సదాశివయ్య, ప్రదీప్ చాంద్, డ్రైవర్ శంకర్, రవితేజ, రోహిత్, ప్రొడక్షన్ వాచ్లు పాల్గొన్నారు.

రెండు బైకులు ఢీ.. ఒకరికి గాయాలు

ప్రజాశక్తి - నాయుడుపేట: రెండు బైకులు ఢీకొన్న ప్రమాదంలో ఒక వ్యక్తి తీవ్ర గాయాల పాలైన ఘటన తిరుపతి జిల్లా, నాయుడుపేట శ్రీకాళహస్తి బైపాస్ రోడ్‌లోని అవని అపార్ట్మెంట్ వద్ద గురువారం చోటు చేసుకుంది. అవని అపార్ట్మెంట్ ఎదురుగా ఫాస్ట్ ఫుడ్ సెంటర్ నడుపుతున్న ఒక వ్యక్తి చూసుకోకుండా మోటార్ సైకిల్ పై రోడ్డు దాటుతున్న సమయంలో నాయుడుపేట ఆర్టీసీ బస్టాండ్ నుంచి తాల్వాయిపాడు వైపు వెళుతున్న ఇద్దరు యువకులు బైక్ పై అతివేగంగా వచ్చి ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో హోటల్ యజమానికి తలకి, కాలుకి తీవ్ర గాయాలయ్యాయి. యువకులు ఇద్దరు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. స్థానికులు అంబులెన్స్‌కు సమాచారమందించి ఆసుపత్రికి తరలించారు.

ట్రాక్టర్ ఢీ.. యువకుడు మృతి

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : పుత్తూరు మండలం, టి.ఆర్.కండ్రిగ కాలనీ సమీపంలో బస్ స్టాప్ వద్ద గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో టి.ఆర్.కండ్రిగకు చెందిన నిఖిల్ (18) మృతి చెందాడు. వివరాల్లోకి వెళ్తే నిఖిల్ పుత్తూరుకు వెళ్లి కూరగాయలు కొనుగోలు చేయడానికి ఆటో కోసం బస్ స్టాఫ్ వద్ద నిలబడి ఉండగా, వి.ఎస్.ఎస్.పురం వైపు నుండి పుత్తూరు వైపు వచ్చిన ట్రాక్టర్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో నిఖిల్ ఎడమ తొడ భాగం, ఛాతి భాగంలో తీవ్ర గాయాలతో రక్తస్రావం అయ్యింది. స్థానికులు అతన్ని పుత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, అక్కడి వైద్యులు మెరుగైన చికిత్స కోసం తిరుపతి రుయా ఆసుపత్రికి తరలించాలని సూచించారు. రుయా ఆసుపత్రికి తీసుకెళ్లగా, వైద్యులు పరిశీలించి అప్పటికే మృతిచెందినట్లు తెలిపారు. ఈ ఘటనపై మృతుడి తండ్రి విజయ్‌కుమార్ పుత్తూరు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

వారపు సంత ప్రారంభం

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : వడమాలపేట మండలంలో గురువారం వ్యవసాయ మార్కెట్ కమిటీ స్థలం ఆవరణలో వారపు సంతను మార్కెట్ కమిటీ చైర్మన్ డి.ఎస్ గణేష్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ పరిసర గ్రామాల రైతులకు, ప్రజలకు అనుకూలంగా సంత ఏర్పాటు చేశామన్నారు.

COURT OF 1ST ADDL.CIVIL JUDGE (JUNIOR DIVISION),CHITTOOR
O.S.NO. 725 OF 2024

Between:
A Lokanadham ..Plaintiff
And
Paluru Ravi Kumar ...Respondent

SUIT SUMMONS TO DEFENDANT

Sri Paluru Ravi Kumar,
Slo.Paluru Veerabadraiah,
D. No. 11-105,Polla Vani gunta,
Gangamma gudi Street,
Ccotton Mill, Renigunta Road',
TIRUPATI 517501,

The plaintiff above has filed a suit against you, for the recovery of pronate debt. you are here by Summoned to appear in the Court in person & by a pleader duy instructed and able to answer all material Questions relating to the Suit or who shall be accompanied by some other person able to answer on **12-12-2025 at 10.30 A.M.** answer the claim.If you failed to appear on the above date mentioned the Suit will be heard in your absence.

Sd/- **GOVINDU SAMBASIVUDU**
Advocate for the Plaintiff

కౌశల్ పోటీల్లో కేవీబి పురం విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - కెవిబి పురం: 2025-26 విద్యా సంవత్సరం జాతీయస్థాయి కౌశల్ ప్రతిభా అన్వేషణ పోటీలలో కెవిబి పురం విద్యార్థులు కే. వైభవ్, ఎనిమిదో తరగతి, కే ప్రజ్వల్ రాజ్, 9వ తరగతి, టీ. జగన్, పదవ తరగతి, విద్యార్థులు మండల స్థాయి నుంచి జిల్లా స్థాయికి ఎన్నికయ్యారు. స్టేట్ లెవెల్ పోటీలు జాతీయ వేదిక భారతీయ విజ్ఞాన సమ్మేళన్ తిరుపతిలో జరగనున్నాయి. క్విజ్, రీల్స్ కాంపిటీషన్, పోస్టర్ ప్రెజెంటేషన్ పోటీలను నిర్వహించారు. సైన్సు, గణితములకు సంబంధించిన అనేక అంశాలను పరీక్షించారు. ఈ పరీక్షల్లో విద్యార్థులు తమ ప్రతిభను చాటి ఉత్తీర్ణులు అయ్యారు.ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు కూనాటి సురేష్, సత్య సుబ్రహ్మణ్యం, నాగరాజు, బాబు, కృష్ణ, భువన్, ప్రకాష్, విజయభాస్కర్ మరియు విజయ పాల్గొన్నారు.

ఎంపీడీవో కార్యాలయంలో ఆధార్ క్యాంప్

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : పుత్తూరు మండల పరిషత్ కార్యాలయంలో గురువారం నుండి ఆధార్ క్యాంప్ నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో శ్రీదేవి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ క్యాంప్ నెల రోజులు పాటు ఉంటుందని, మండలంలోని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నాణ్యమైన భోజనం అందించండి

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: ప్రభుత్వ పాఠశాలల్లో అమలవుతున్న డొక్కా సీతమ్మ మధ్యాహ్న పథకంలో మెనూ ప్రకారం రుచికరమైన భోజనాన్ని విద్యార్థులకు పెట్టాలని ఎంఈవో మునిసుబ్రమణ్యం తెలిపారు. నాణ్యమైన విద్యను ఉపాధ్యాయులు బోధించాలన్నారు. గురువారం బుచ్చినాయుడు కండ్రిగ ప్రాథమిక పాఠశాలలో తనిఖీలు నిర్వహించారు. మధ్యాహ్న భోజనాన్ని రుచి చూసి, విద్యార్థులతో కలసి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

ముందస్తు బాలల దినోత్సవం

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు పట్టణంలోని శ్రీ సరస్వతి శిశు మందిరంలో గురువారం లైన్స్ క్లబ్ అధ్యక్షులు అక్కన రమణయ్య ఆధ్వర్యంలో బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని విద్యార్థులకు ఆటల పోటీలను నిర్వహించి, గెలుపొందిన విద్యార్థులకు లయన్ వాకాటి రామ్మోహన్ రావు దాతృత్వంతో ఎం.జె.ఎఫ్, ఐ.ప్రసాద్ చేతుల మీదుగా బహుమతులను అందజేశారు. అలాగే పట్టణంలో రోడ్డు పక్కన కూరగాయలు అమ్ముతున్న పేద మహిళకు రెండు వేల రూపాయలు విలువచేసే గొడుగును అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లైన్స్ క్లబ్ నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి లయన్ రవి చంద్రారెడ్డి, ట్రెజరర్ వీరేంద్రనాథ్, మదనమేటి రమణయ్య, రూపేష్ రెడ్డి, డాక్టర్స్ చంద్రహాస్, పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎగ్జామినేషన్ సెంటర్‌లో సౌకర్యాల పరిశీలన

ప్రజాశక్తి -ఏర్పేడు : ఏర్పేడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ప్రభుత్వ పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ గురు స్వామి గురువారం సందర్శించారు. ఆయన మాట్లాడుతూ రాబోవు 10వ తరగతి పబ్లిక్ ఎగ్జామినేషన్స్ సందర్భంగా ఎగ్జామినేషన్ సెంటర్‌లో కల్పించవలసిన సౌకర్యాలపై ప్రధానోపాధ్యాయురాలు మునిలక్ష్మికి సూచనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి దయాకర్ పాల్గొన్నారు.

'బేటీ బచావో బేటి పడావో'పై అవగాహన

ప్రజాశక్తి - రామచంద్రాపురం : మండలంలోని బలిజపల్లిలో మిషన్ శక్తి - సంబల్ కార్యక్రమంలో భాగంగా మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో భేటీ బచావో... బేటి పడావో కార్యక్రమం చేపట్టారు. గురువారం బలిజపల్లి మోడల్ ప్రైమరీ స్కూల్, అంగన్వాడీ కేంద్రంలో ఐసిడిఎస్ సూపర్వైజర్ మనీలా ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాల బాలికలకు, పిల్లల అక్రమ రవాణా, బాల కార్మిక వ్యవస్థ, బాల్య వివాహాల నిషేధంపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంపొందించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో, పాఠశాల ఉపాధ్యాయులు ప్రసాద్, సులోచన, రాజ్యలక్ష్మి, రాజేశ్వరి అంగన్వాడీ సిబ్బంది వనిత, భారతి, బాల బాలికలు పాల్గొన్నారు.

రాయితీపై విత్తనాలు పంపిణీ

పశు వైద్యాధికారి డాక్టర్ ముని రాజా

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: మండలంలోని రైతులకు 75 శాతం రాయితీపై మొక్కజొన్న, జొన్న గడ్డి విత్తనాలను పంపిణీ చేయడానికి సిద్ధంగా ఉంచినట్లు తిరుపతి జిల్లా బుచ్చినాయుడు కండ్రిగ మండల పశు వైద్యాధికారి డాక్టర్ ముని రాజా పేర్కొన్నారు. మొక్కజొన్న గడ్డి విత్తనాల సంబంధించి ఒక కేజీ ధర 68 రూపాయలు కాగా, ఇందులో 51 రూపాయలు సబ్సిడీ పోను రైతుల కేజీకి 17 రూపాయలు చెల్లించాలన్నారు. జొన్న గడ్డి విత్తనాలు ఒక కిలో 92 రూపాయలు కాగా ఇందులో సబ్సిడీ 69 రూపాయలు ఫోను ఒక కిలో 23 రూపాయిలు చెల్లించాలన్నారు. ప్రస్తుతం జొన్న గడ్డి విత్తనాలు 500 కిలోలు, మొక్కజొన్న గడ్డి విత్తనాలు 1000 కిలోలు అందుబాటులో ఉన్నాయన్నారు. ఆధార్ కార్డు తీసుకొచ్చి సబ్సిడీ ధరలపై మొక్కజొన్న, జొన్న గడ్డి విత్తనాలను తీసుకోవాలని కోరారు.

అకడమిక్ విషయాలపై భేటీ

ప్రజాశక్తి - క్యాంపస్ : జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం వైస్-ఛాన్సలర్ ప్రొ.జి.యస్.ఆర్ కృష్ణమూర్తితో గురువారం డైరెక్టర్ అండ్ ప్రిన్సిపల్ రీసెర్చ్ సైంటిస్ట్, ఫౌండేషన్ ఫర్ సైంటిస్ట్ రీసర్చ్ అండ్ టెక్నాలజీ ఇన్నోవేషన్ హైదరాబాద్ ప్రొ.శ్రీహరిరావు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా విసి మాట్లాడుతూ సంస్కృతంలో సైంటిఫిక్ అండ్ రీసెర్చ్ అంశాల్లో ఎటువంటి పురోగతిని సాధించవచ్చు అనే అంశం పై చర్చించారు. వివిధ అకాడమిక్ యాక్టివిటీస్, అకాడమిక్ ఇన్నోవేషన్ వర్క్స్‌పై చర్చించారు. ఈకార్యక్రమంలో విశ్వవిద్యాలయం ఐ.క్యూ.ఎ.సి.డైరెక్టర్ ప్రొ.సతీష.కె.ఎస్, పి.ఆర్.ఓ రమేష్ బాబు, ఓ.ఎస్.డి రఘునందన్ పాల్గొన్నారు.

చెత్త సేకరణకు వాహనాలు అందజేత

ప్రజాశక్తి - తిరుపతి (మంగళం): జిల్లా పరిధిలోని దళితవాడలలో చెత్త సేకరణకు ప్రధానమంత్రి ఆదర్శ గ్రామ యోజన, జిల్లా పరిషత్తు సౌజన్యంతో 20 ఎలక్ట్రిక్ వాహనాలను జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్ ముఖ్య అతిథిగా హాజరై జిల్లా కలెక్టరేట్ ఆవరణలో గురువారం ప్రారంభించారు. ఎలక్ట్రిక్ వాహనాల ద్వారా దళితవాడలలో పారిశుద్ధ్య నిర్వహణకు, ఘన వ్యర్థాల సేకరణకు వీలుగా 6 రకాల ప్లాస్టిక్ డబ్బాలను అందుబాటులో ఉంచారు. ఈ పథకం ద్వారా పారిశుద్ధ్య నిర్వహణకు సంబంధించిన వివరాలను జడ్పీ సీఈవో రవికుమార్ నాయుడు, తిరుపతి జిల్లా పంచాయతీ అధికారిని సుశీలదేవి జిల్లా కలెక్టర్ కు వివరించారు. ఈ కార్యక్రమంలో ట్రైన్ ఈ కలెక్టర్ సందీప్ రఘువాన్షి, తిరుపతి రూరల్ డిప్యూటీ ఎంపీడీవో దయాకర్, జిల్లా పంచాయతీ కోఆర్డినేటర్ షణ్ముగ రామ్, పరిపాలన అధికారి మోతి, పంచాయతీల సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా అమర రాజా 40వ ఫౌండేషన్ డే క్రీడల ప్రారంభోత్సవం

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో: ప్రతి సంవత్సరం అమర రాజా ఫౌండేషన్ డే సంబరాలను డిసెంబర్ 20న వైభవంగా నిర్వహించడం ఆనవాయితీగా కొనసాగుతోంది. ఈ సందర్భంగా ఉద్యోగుల ఉత్సాహాన్ని పెంపొందించేందుకు వివిధ రకాల క్రీడా పోటీలు నిర్వహించడం జరుగుతుంది. ఈ కార్యక్రమాల భాగంగా ఈ రోజు (13.11.2025) కేవీ ఎస్ స్పోర్ట్స్ పార్క్ గ్రౌండ్ లో క్రికెట్ క్రీడల ప్రారంభోత్సవం ఘనంగా జరిగింది. ఈ వేడుకకు సంస్థ యాజమాన్యం నుండి ముఖ్య అతిథులుగా శ్రీనివాసరావు- అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్, మురళి-అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్, మునేశ్వరనాయుడు-అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్, సుభాష్ - సీనియర్ జనరల్ మేనేజర్, రామమూర్తి రాయలీ-అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్, కిషన్ కోనా - సీనియర్ జనరల్ మేనేజర్, రామనకుమార్ - జనరల్ మేనేజర్, సుధాకర్, రాం భూపాల్ రెడ్డి, ఈశ్వరరావు, సత్యనారాయణ రెడ్డి, శ్రీదేవి పాల్గొన్నారు.

ఆటగాళ్లతో ఉత్సాహంగా..

ఈ సందర్భంగా ప్రసంగించిన అతిథులు, ఆటగాళ్ల భద్రతను ప్రాధాన్యతగా తీసుకొని, గెలుపోటములను పక్కనపెట్టి మంచి జట్టు భావనతో ఆడాలని సూచించారు. సంస్థ ఉద్యోగులలో ఉత్సాహాన్ని నింపే ఇలాంటి కార్యక్రమాలను ప్రోత్సహించడం మేనేజ్‌మెంట్ (నిర్వహణా వర్గం) యొక్క సానుకూల దృక్పథాన్ని ప్రతిబింబిస్తుందని అన్నారు. తదుపరి కార్యక్రమంలో ఆటగాళ్లు, జట్టు కెప్టెన్లతో పరిచయం అనంతరం, అతిథులు ప్రదర్శన మ్యాచ్ ఆడి ఆటగాళ్లలో ఉత్సాహాన్ని రేకెత్తించారు. క్రీడల్లో ఆర్కిడ్ జట్టు- ట్యూలిప్ జట్టుపై 48 పరుగుల తేడాతో విజయం సాధించింది. రెండో మ్యాచ్‌లో హిబిస్కస్ జట్టు -లిల్లీ జట్టుపై 86 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. ఈ కార్యక్రమానికి 40వ ఫౌండేషన్ డే ఛైర్‌పర్సన్ జి. మంజునాథ్, కో-ఛైర్‌పర్సన్ డి. చంద్రబాబు, అలాగే క్రీడలు, ఆటల సమన్వయకర్త రాటకొండ భరత్ హాజరై విజయవంతంగా కార్యక్రమాన్ని నిర్వహించారు.

సామూహిక జన్మదిన వేడుకలు

బదిలీపై వెళుతున్న వై.మేరీ ప్రియతకు సన్మానం

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : శ్రీ కృష్ణ సేవా సమితి అధ్యక్షుడు, తిరుపతి జిల్లా టెన్నికాయిట్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ బి శ్యామసుందరరావు (మయూరి శ్యామ్ యాదవ్)దాతృత్వంతో మినీ గురుకులంలో ప్రతీ నెలా క్రమం తప్పకుండా జరిగే సామూహిక జన్మదినాలను 13 మంది విద్యార్థినుల చేత భారీ కేక్ ను కట్ చేయించి వారికి జన్మదిన శుభాకాంక్షలు తెలియ చేశారు. అనంతరం ప్రిన్సిపల్‌గా ప్రమోషన్ పొంది బదిలీపై వెళుతున్న వై.మేరీ ప్రియతకు అభినందనలు తెలుపుతూ సన్మానించారు. మినీ గురుకులం నూతన హెచ్ఎం, వార్డెన్‌గా బాధ్యతలు చేపట్టిన కె .వి. రజిని కుమారికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాద్యాయునులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పౌష్టికాహారం పంపిణీ

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు పట్టణంలోనీ స్థానిక డిఎన్ఆర్ కమ్యూనిటీ హాల్లో రోటరీ వెస్ట్ క్లబ్ ఆధ్వర్యంలో శ్రీలక్ష్మి, పీఎం రావు దంపతుల దాతృత్వంతో క్రీడాకారులకు పౌష్టికాహారం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరు సేవా దృక్పథాన్ని అలవరచుకోవాలన్నారు. యువత సమాజ సేవా కార్యక్రమాల్లో పాల్గొనాలన్నారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షులు విజయ భాస్కర్ రెడ్డి, కార్యదర్శి రాఘవరెడ్డి, వాసు గౌడ్, శ్రీనివాసరావు, ఎం హరినాథ్ రెడ్డి, కృష్ణారెడ్డి, లక్ష్మీనారాయణ, కోదండరామయ్య, గిరిబాబు, సిద్ధారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

యూరియా పంపిణీ



ప్రజాశక్తి- వరదయ్యపాలెం : మండల పరిధిలోని రైతులకు సింగిల్ విండో ఛైర్మన్ ఆణిముత్యం నందకిషోర్ రెడ్డి గురువారం యూరియా పంపిణీ చేశారు. రైతుల వివరాలు త్వరగా సేకరించి అందరికీ యూరియా అందేట్లు చూడాలని ఆయన అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా రైతులు ఛైర్మన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పరిసర గ్రామాల రైతులు, అధికారుల పాల్గొన్నారు.

మా ఆస్తిని కాపాడండి

ప్రజాశక్తి - తిరుపతి(మంగళం): మా పూర్వీకుల నుండి సంక్రమించిన ఆస్తిని మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అనుచరులు, కమలాపురం టిడిపి ఎమ్మెల్యే పుత్తా కృష్ణచైతన్య రెడ్డి నకిలీ డాక్యుమెంటు సృష్టించి పటం చంద్రశేఖర్ ద్వారా కాజేయాలని కుట్రపన్నారని జనసేన పార్టీ రాయలసీమ రీజనల్ కోఆర్డినేటర్ ఆకుల వనజ ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం తిరుపతి ప్రెస్ క్లబ్‌లో విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. తన కుమారుడు ఆకుల గంధర్వకృష్ణ పేరుపై ఉన్న సదరు ఆస్తులను 2017లో జిపిఎ ద్వారా తనకు హక్కులను కల్పించడం జరిగిందన్నారు. ఈ క్రమంలో ఎలాగైనా 50 కోట్ల విలువైన ఆస్తులను నకిలీ అగ్రిమెంటును సృష్టించి తమ వసం చేసుకోవాలని బెదిరింపులకు దిగుతున్నారని, దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేసిన వారికే వత్తాసు పలకడం ఆశ్చర్యం కలిగించిందన్నారు. అధికారులు, కూటమి ప్రభుత్వం తమకు న్యాయం చేయాలని కోరారు.